ఓం శ్రీసాయిరాం

# భగవాన్ శ్రీసాయిబాబా వారి బాల్యము

శ్రీమతి మంచిరాజు కామేశ్వరమ్మగారు

లేఖకుడు. పానుగంటి శ్రీరామచంద్రమూర్తి

బాబాగారు ఉరవకొండ హైస్కూలుకి చదువుకోటానికి వచ్చిరి. అప్పుడు మా యింటిలో ప్రవేటు చెప్పించుకొనిరి. బాబాగారి ముఖారవిందమును చూచి నేను దైవకళగా భావించితిని. ఒకనాటి గురువారము తన లీలలు చూపదలచినాడు. సాయంత్రము ఐదు గంటలకు వాళ్ళ వదిన బాబా పూజ చేసినది. బాబా ఊర్ధ్వదృష్టితో చూచి భూతభవిష్యద్వర్తమానములు చెప్పుచున్నారు. నాతో వచ్చిన స్నేహితులు బాబా దేముడు అని చెప్పి న్ను నమస్కారము చేయమన్నారు.నాకు నమ్మకము లేదు, నమస్కారము చేయనని చెప్పినాను. వారు బలవంతముగా బాబాగారి పాదముల వద్దకు తోసినారు. నా అరచేతులు రెండూ బాబాగారి పాదములమీద పడినవి. బాబా సంతోషముతో అభయమిచ్చి ఆదరించినారు. నీవు నా దాసురాలివి అని చెప్పినారు. బాబా నీకు దాసుడై నీకన్నివిధముల సహాయము చేయును అని చెప్పిరి.

రెండవ వారము బాబా పూజ నేనే చేసితిని. మరల ఊర్ధ్వదృష్టితో నిలబడి భూతభవిష్యత్‌వర్తమానములను చెప్పుచుండిరి. నేను సంతోషముగా బాబాగారి పాదములకు నమస్కారము చేసితిని. బాబా సంతోషముతో లేవదీసి నీకు గొప్ప బహుమానము యిస్తానని చెప్పి, షిరిడీబాబా సమాధికి వెళ్లినప్పుడు ధరించిన వస్త్రములో ఆరంగుళములు పొడవు, ఆరంగుళములు వెడల్పు కలిగిన ఒక వస్త్రమునిచ్చిరి. నేను ఆ వస్త్రమును చూచి ఆనందముతో మైమరచిపోతిని. నేనెంతో గొప్పదానినని భావించితిని. కొంతసేపటికి నాకేమైనా బాధ వచ్చినదేమోనని అందరూ అనుకొన్నారు. ఆ వస్త్రమును ఒక యిత్తడి డబ్బాలో పెట్టి పూజచేసికొంటూ కొన్నాళ్లు ఆనందముగా ఉంటిని.

మరల మూడవ వారము వచ్చినది. జనం చాలామంది వచ్చినారు. అప్పుడు నేను బాబాగార్కి నమస్కారము చేస్తే 'నీకు షిరిడీబాబా ఆశీర్వాదము పంపించినారు' అని పచ్చని అక్షింతలు యిచ్చినారు. వాటిని ఆ వస్త్రములో మూటకట్టి పూజచేసుకుంటూ ఉంటిని. మరునాడు బాబాగారు మా యింటికివచ్చి మీకు బాబాగారు వస్త్రము, అక్షింతలు యిచ్చినారుట, నాకు చూపించమని అడిగినారు. నేను స్నానము చేసిన తరువాత చూపించినాను. మీరు భక్తితో పూజింతురు కావున బాబా యిచ్చినారు అని బాబాగారు చెప్పినారు.

నాల్గవ వారము వచ్చినది. బాబాను చూచి నమస్కరించితిని. ఇంక నీవు రావలదు. నేనే నీ దగ్గరకు వచ్చి పూజ చేయించుకుంటాను. పీటవేయమని బాబాగారు చెప్పినారు. నాడు మొదలుకొని పూజచేసుకుంటూ, పూజ చూచుటకు వచ్చువారికికూడ వారివారి కోరికలు సఫలమవుతూ ఉండేవి.

ఒకరోజు కృష్ణాష్టమినాడు బాబా మమ్మల్నిద్దరినీ పిలచి అనేకమైన లీలలు చూపించిరి. అవి ఏమనగా రామావతారములే తాను చేసిన పనులు ఒక్కోక్క కాండకు ఒక్కోక్క లీల చూపించినారు. ఈ లీలలు తెరమీద సినీమా చూపించినట్టుగా చూపించినారు. ఇట్లే కృష్ణావతారము లీలలు చాలా చూపించినారు. పండరీపురము పాండురంగడు, శ్రీరంగము రంగనాథుడు, తిరుపతి వేంకటేశ్వరస్వామి, సింహాచలము నరసింహావతారము యివన్నీ ఆనందముగా చూపించినారు. అప్పుడు బాబగారి వయస్సు 14సంవత్సరములు.

కొన్ని రోజులకు భాద్రపదమాసము వినాయకచవితి వచ్చినది. ఆదినము మా యింటిలో వినాయకపూజ చేసుకొంటిమి. వినాయకుని వాయనము వినాయకుని ప్రతిమ ముందు ఉంచినాము. నేను శ్రమచేత మధ్యాహ్నము కొంచెము కళ్లు మూసుకొని పడుకొంటిని. బాబా కలలో నా వాయనమేది అని అడిగెను. నీవు వినాయక రూపము చూపలేదు, అందుచే నీకు వాయనమివ్వను. వినాయక రూపము చూపిస్తే నాకు వాయనము యిచ్చెదవా? అని బాబాగారు అడిగినారు. అప్పుడు నేను యిస్తానని చెప్పినాను.బాబా అప్పుడు కలలో చతుర్భుజములతో, పెద్ద తొండము కల్గి వినాయక స్వరూపము చూపించినారు. అప్పుడున్నేను బాబాగారికి వాయనము యిచ్చినాను. సాయంకాలము ఆరు గంటలకు బాబాను పిల్చి చాపవేసి దానిమీద పీటవేసి కజ్జికాయలు, ఉండ్రాళ్లు, కొబ్బరికాయ, అరటిపండ్లు పళ్లెములో నుంచి బాబాకు యిచ్చినాను. కొబ్బరికాయను షిరిడీబాబా పీట దగ్గర కొట్టమని మరల యిచ్చినారు.

కజ్జికాయలు, అరటిపండ్లు, ఉండ్రాళ్లు పీటమీద పెట్టుకొనిరి. పళ్లెము మరల యిచ్చినారు. అప్పుడు పెద్ద శబ్దముతో పటికపంచదారముక్కలు ఆ పళ్లెములో పడినవి. పటికపంచదారముక్కలు ఎక్కడనుంచి వచ్చినవని నేను బబాగారిని అడిగితిని. తాను యేమీ తెలియనివానివలె ఏమి ఎక్కడనుండి వచ్చినవని అడిగినారు. అంతా నీ మహిమే బాబా అని సంతోషముతో నమస్కరించితిని. అప్పుడు పటికపంచదారను అందరికీ ప్రసాదముగా బాబాగారు పెట్టినారు.

ఒకనాడు బాబాగారు తెల్లవారిన తరువాత మా యింటికి వచ్చినారు. ఇరవైరెండు సంవత్సరముల ఆడపిల్ల చనిపోయినది. దాని స్వరూపమంతా వర్ణించినారు. నేను అది విని చాలా దుఃఖ పడినాను. మీరు దుఃఖ పడకండి, నాకునూ బాధగా ఉండును అని బాబాగారు అనిరి. బాబా మిమ్మల్ని చూస్తుంటే నా దుఃఖమంతయూ మరచినాను. నాకు మూడువేళల మీ దర్శన భాగ్యము కలుగవలెనని బాబాను కోరినాను. అటులనే నాటినుంచి నేటివరకు మూడు వేళలా దర్శనము యిచ్చుచున్నారు. బాబా భగవంతుడని నేను మొదటనే ఆత్మార్పణము చేసితిని. బాబాను భగవద్దృష్టితో నేను చూచుచుంటిని. ప్రతిరోజూ నేను పురాణకాలక్షేపము చేయుచుంటిని. బాబాగారు వారి అన్నగారి పిల్లలను తీసుకొని పురాణమునకు వచ్చెడివారు. కొన్నిరోజులకు బాబాగారిని 'బాబా! నీవు పురాణమునకు వచ్చుచుంటివి కదా, నీకేమైనా అర్థమగునా?' అని అడిగితిని. అప్పుడు బాబాగారు,' అర్థముకాకేమి, అంతా నేనే కదా!' అని అనిరి.

మార్చి 7వ తేదీని బాబాగారు భోజనము చేసిన తరువాత, నీళ్లగదిలో చేయి కడుక్కోటానికి వెళ్లి, అక్కడ బాబాగారు 'నాకు తేలు కుట్టినదని'అని కేకలు వేసిరి. తరువాత పది పన్నెండు గంటలదాకా బాధపడుతూ ఉన్నారు. ప్రక్క యింటిలోనే బాబాగారు ఉండుటవలన, నేను బాబా బాధ తగ్గించమని షిరిడీ బాబా ప్రార్థన చేసితిని. మరునాడుదయము మంచినీరు కావలెనని బాబాగారు మా యింటికి వచ్చినారు. అప్పుడు బాబాగారు నాతో యిట్లు చెప్పిరి'నాకు తేలు కుట్టినది. నీరు తేలేను. మీరు నీరు యిచ్చుదురు కదా అని మీ యింటికి వచ్చితిని'. అప్పుడు నేను మడిలో ఉన్న నీళ్లను బాబాగారు తెచ్చిన చెంబులో పోసితిని. బాబాగారు కృష్ణపరమాత్ముడు గోపికలను చూచిన కృపాదృష్టితో నన్ను చూచి, 'మీరు కాబట్టి మంచినీరు యిచ్చినారు' అని చెప్పి యింటికి వెళ్లినారు. మరల ఆరోజు తేలు కుట్టిన టైము 7గంటలకు భోజనము చేయుటకు కూర్చొనిరి. అప్పుడు బాబా పెద్ద కేకవేయుచూ క్రింద పడిరి. బాబాగారి అన్నగారు బాబాకు చేయి కడగి మంచము మీద పడకో పెట్టిరి. అందరూ వాతము తేలు కుట్టినదేమోనని భయపడిరి. అప్పుడు డాక్టరును తీసుకువచ్చి చూపించిరి. ఆ డాక్టరు ఒక్కొక్క గంటకు ఒక్కొక్క ఇంజక్షను చేసిరి. ఇంజక్షను చేయునప్పుడల్లా బాబ పైకెగిరి క్రింద పడేవారు. అప్పుడు పది మంది పిల్లలు పట్టుకొని ఇంజక్షన్లు చేసెడివారు. మరనాడుదయము బాబాను ఊరిలో పెద్దవారందరూ వచ్చి సంకులమ్మ అను గ్రామ దేవత బాబా చెరువు గట్టు దగ్గరకు వెళ్లినప్పుడు బాబాను పట్టిదన చెప్పిరి. అప్పుడు బాబాగారి వదిన పసుపు, కుంకుమ, కొబ్బరికాయ పట్టకొని బాబాగారితో చెప్పి సంకులమ్మ గుడికి వెళ్లిరి. అప్పుడు బాబాగారు కొబ్బరికాయ మూడుమక్కలగునని చెప్పిరి. అటులనే ఆ గుడిలో కొట్టిన కొబ్బరికాయ మూడుముక్కలైనది. తరువాత కొంతమంది వచ్చి బాబాకు భూతము పట్టినదనిరి. అప్పుడు వారు భూతవైద్యుని పిలిపించిరి. ఆ భూతవైద్యుడు వచ్చి రంగులతో ముగ్గులు వేసి దానిమీద పీటవేసి దానిపై బాబాను కూర్చుండబెట్టి కొన్ని మంత్రములను పఠించగా , బాబాభూతవైద్యుని చెంపపై కొట్టిరి. 'నేనెవరినో తెలియదా? నీవు పూజించు దేవతకు అధికారి నేను' అని బాబాగారు ఆ భూతవైద్యునితో చెప్పిరి. అప్పుడు ఆ భూతవైద్యుడు భయపడి నా తండ్రిని పంపెదనని వెడలిపోయెను. మరునాడు ఊరిలో కరిబసవన్న తీర్థము చూచుటకు ముందు తెల్లని బట్టలు కట్టుకొని మాయింటికివచ్చి, 'నేను ఎట్లా ఉన్నాను?' అని అడిగిరి. అప్పుడు నేను గోపాలకృష్ణునివలె ఉన్నావంటిని. అప్పుడు బాబా ఇటులనే గోపాలకృష్ణుడు ఉంటాడా అని నవ్వుకొనుచూ వెళ్లిపోయిరి. తరువాత బాబా తల్లితండ్రులు వచ్చి కదిరి దగ్గరున్న వైద్యుని దగ్గరకు బాబాను తీసుకొని వెళ్లిరి. బాబాను ఆ వైద్యుడు చూచి బాబా తలమీద 108 గాట్లు వేసెను. రక్త ప్రవాహముతో బాబా సొమ్మసిల్లిపోయిరి. అయిననూ ఆ

వైద్యుడు విడువలేదు. 108 నిమ్మపళ్ల రసమును తలమీద రుద్ది, 108 బిందెల నీరు బాబా తలపై పోసిరి. తల్లిదండ్రులు బాబా బాధను చూడలేక ఆ వైద్యునికి యివ్వవలసిన డబ్బు యిచ్చి బాబాను యింటికి తీసుకువెళ్లిరి. అప్పుడు బాబా భగవద్భక్తి విషయములు అన్నివేళల మాట్లాడుచుండెడివారు. మరల కొన్ని రోజులకు బాబాను తిరిగి వైద్యుని దగ్గరకు తీసుకొని వెళ్లుటకు నిశ్చయించి బండి కట్టించిరి. కానీ ఆ బండి కదలలేదు. అందువలన ఆ ప్రయాణమును రద్దు చేసుకొనిరి. బాబా భగవంతుని విషయములే చెప్పుచుండిరి. ఒకనాడు బాబా 'నేను సాయిబాబాను. భారద్వాజఋషి గోత్రుడను. ఆపస్తంబ సూత్రుడను. భక్తులను రక్షించుటకై అవతరించినాను. మీ కుమారుడను కాను. నా లీలలు, నా మహిమలు రేపు గురువారము చూపుదును. మీరందరూ గృహములను శుభ్రము చేసుకొని నా దగ్గరకు రండి.' అందరూ ఆ ప్రకారముగానే వచ్చినారు. వారందరికీ భూత, భవిష్యత్, వర్తమాన కాలములు బాబాగారు చెప్పిరి. అందులో కొందరు బాబాను హేళన చేసిరి. అప్పుడు బాబా కొన్ని మల్లెపూలు తీసుకొని, ఆ హేళన చేసిన వారికిచ్చి, వాటిని కిందకు విసరినచో నా పేరు కనపడునని చెప్పిరి. వారు అట్లే చేసిరి. అప్పుడు ఆ మల్లెపూలు 'సాయిబాబా' అను అక్షరములు ఏర్పడినవి. అకాలములోని పూలు, పండ్లు హస్తచాలనముతో తీసి యిచ్చిరి. అది ఒకతను చూచి యిదంతయూ వట్టి అబద్దము అని బాబాను దూషించెను. కొంతసేపటికి అతడు కడుపు నొప్పితో బాధపడుచుండెను. అతడు అపరాధిని, అపరాధిని అనుకొంటూ వచ్చి బాబాగారి పాదములపై పడెను. బాబా ప్రేమ స్వరూపుడు కనుక హస్తచాలనముతో విభూతి తీసి అతని నోటిలో వేసెను. అప్పుడు అతనికి కడుపునొప్పి తగ్గెను. ఇదంతయూ చూచుచున్న భక్తులలో కరణం సుబ్బమ్మ అను ఒకామె బాబాను చూచి, గోపాలకృష్ణుడుగా కనబడుటవలన ఆమె బాబాను తనింటికి తీసుకొని పోయెను. బాబాగారు కరణం సుబ్బమ్మగారింటిలోనే ఉండిరి. బెంగుళూరు, మైసూరు నుంచి కొందరు భక్తులు పుట్టపర్తి వచ్చిరి. బాబా వారందరికీ గ్రహబాధలు, గృహబాధలు నివారించెడివారు. అప్పుడు నేను కూడా కరణంసుబ్బమ్మగారింటికి రెండు మార్లు వెళ్లితిని. ఆమె బాబాకు, భక్తులకు చేసిన సేవ అమోఘమైనది. జూన్ నెలలో బాబా మరల హైస్కూలులో చేరుటకు ఉరవకొండకు వచ్చిరి. బాబాగారు అప్పుడు ఒక నాటకములో రాధ వేషము వేసిరి. అప్పుడు బాబాగారికి అద్దము దువ్వెన, పౌడరుడబ్బా మొదలైనవి బహుమతులుగా యిచ్చిరి. అప్పుడు బాబాగారు మా యింటికి వచ్చి వచ్చిన బహుమతులను నాకు చూపించిరి. 'ఒక ఉపాధ్యాయుడు నన్ను అచ్చు ఆడదానిలా నటించితివి. నీకు కుంకుమ భరిణ యివ్వలేదని అన్నారు' అని బాబాగారు నాకు చెప్పిరి. బాబాగారు చిన్నతనమున ప్రాథమిక పాఠశాలలో చదువునప్పుడు అక్కడ సుబ్బన్నాచార్యులు అను ఉపాధ్యాయుడు బాబాను బెంచి ఎక్కమనెను. పాఠశాల విడిచిపెట్టిరి. పిల్లలంరూ వెళ్లిపోయిరి. కానీ ఆ ఉపాధ్యాయుడు కుర్చీనుండి లేవలేకపోయెను. అప్పుడు బాబాఅంటే ప్రియమైన ఒక మహమ్మదీయ ఉపాధ్యాయుడు ఆ ఉపాధ్యాయుని రమ్మనమనెను. కానీ అతను కుర్చీకి అంటుకొని పోవుట చూచి ఎదురుగానున్న బెంచీపై బాబా నిల్చుండుట చూచి, ఆ కుర్చీకంటుకొనిపోయిన ఉపాధ్యాయునితో ఆ మహమ్మదీయుడు బాబాను కూర్చుండమని చెప్పుము, అప్పుడు నీవు లేచెదవని చెప్పెను. ఆ ఉపాధ్యాయుడు బాబాను కూర్చుండమని చెప్పెను. అప్పుడు ఆ ఉపాధ్యాయుడు లేచెను. బీదపిల్లలకు తినుబండారములు, పుస్తకములు, పలకలు, పెనిసిళ్లు, పలకపుల్లలు బాబా తన ఖాళీ సంచినుంచి తీసి యిచ్చెడివారు. కానీ ఆ పిల్లల చిన్నపిల్లలగుటచే బాబా ప్రభావము తెలిసికొనలేక పోయిరి.

బాబాగారు కమలాపురము వెళ్లక పూర్వము బాబాను వాళ్ళు షిరిడీబాబా పాటలను పాడకూడదనియు, పటమును పూజింపవలదనియు బాబాను కట్టుదిట్టము చేసిరి. రెండురోజులు బాబా అట్లే చేసెను. వాళ్ళ అజ్ఞానమునకు బాబా నవ్వుకొనిరి. అప్పుడు వాళ్ళచేతనే బల్లను వేయించి, దానిపై షిరిడీబాబా పటమునుంచి వారిచేత పూజ చేయించిరి. ఇట్లు బాబా, తనను పూజచేయవలదనిన వారిచేత పూజ చేయించి తన మహిమ చూపించిరి.

కమలాపురము నుండి వచ్చి బాబా ఉరవకొండలో చదువునప్పుడు అతని అన్నగారి కుమార్తెకు జబ్బు చేసినదని

టెలిగ్రాము వచ్చినది. మరునాడు బాబాగారు సంతలో కొనిన కూరలతో, మాయింటికి వచ్చి, యిచ్చి నేను కమలాపురము వెళ్లుచుంటిని అని నాతో చెప్పిరి. బాబాగారు అక్కడకు వెళ్ళిన తరువాత విభూతి తీసి నీళ్లలో కలిపి ఆ పిల్లకి పట్టమనిరి. అప్పుడు ఆ పిల్లకి తెలివి వచ్చినది. మరునాటినుండి ఆడుకొనుచుండెను. బాబా అక్కడ వున్నప్పుడు ఆ అమ్మాయి బాబా మిఠాయిఉండలు తింటున్నాడని పేచీ పెట్టినది. ఊరుకోమని బాబా చెప్పిరి. కొంత సేపటికి గది తాళము తీసి ఆ మిఠాయిఉండలను భక్తులందరూ లెక్కపెట్టిరి. అందులో ఒకటిన్నరుండ తక్కువ వచ్చినది. ఈ అద్భుతమైన మహిమ చూచి భక్తులందరూ సంతోషించిరి. అప్పుడు భక్తులందరూ మూడు తులాల బంగారముతో ఒక పిన్నీసు, ఒక ఉంగరము బాబాకు బహుమానముగా యిచ్చిరి. సోమవారము ఉదయము 7గంటలకు ఆ పిన్నీసు, ఉంగరము నాకు చూపించిరి. అప్పుడు నేను ఉంగరము నీవు ఉంచుకొని పిన్నీసు మీ వదినకిమ్మని బాబాతో చెప్పితిని. బాబా వాళ్ల వదిన నడిగి పిన్నీసు, ఉంగరము పెట్టుకొని స్కూలుకి వచ్చుచుండెను. ఒక కొట్టు దగ్గరకు వచ్చి బాబా పిన్నీసు, ఉంగరము క్రింద వెతుకుచుండిరి. ఇదంతా మాయ అని అభినయముచేయుట మొదలుపెట్టిరి. అన్నగారు, తమ్మిరాజుగారు స్కూలుకి టైము అయినది రమ్మని బాబాను తొందరపెట్టిరి. బాబా స్కూలుకి వెళ్లిరి. బాబా ఎవరితో మాట్లాడకుండా మౌనముగా నుండిరి. మరునాడు బాబా స్కూలుకి వెళ్లి, యింటికి వచ్చి పలక, పుస్తకములు విసిరివేసిరి. అప్పుడు పలక గుండ అయినది. ఇది అవిద్య. నేను భక్తులను రక్షించుటకై అవతరించితిని. నేను బాబాను. నేను మీవాడను కాను అని తనలో తాను అనుకొనుచుండెను. ఆ మాట విని వాళ్ల వదిన చాలా బాధపడెను. అప్పుడు నేను బాబా దగ్గరకొచ్చి పాదములు పట్టుకొని నాకు తరుణోపాయము చెప్పమని అడిగితిని. బాబా అట్లేనని అభయమిచ్చిరి. అదిమొదలుకొని బాబా మన దృష్టిలో లేరు. వారు ఆత్మదృష్టిలో నుండిరి. మరునాడు హొస్పేట, బళ్ళారి, హంపి మొదలగు పట్టణములనుండి 20మంది భక్తులు వచ్చిరి. బాబా అప్పుడు వారలకు విందు చేయమని నాతో చెప్పిరి. అప్పుడు నేను పులిహార, హల్వా చేసి వారికి టిఫిను పెట్టితిని. బాబా, ఆ భక్తులు టిఫిను చేసి సాల్టుయినిస్పెక్టరు గారింటికి వెళ్లిరి. అక్కడ భజన చేయుచుండగా బాబాగారి చేతిమీద కన్నీరు పడినది. కళ్లితోటలో బాబా బెంచిలో కూర్చొను పిల్లలు బాబా కొరకు దుఃఖపడుచుండిరి. అప్పుడు బాబా వారి దగ్గరకు వెళ్ళి ఆ పిల్లలను భజన దగ్గరకు తీసుకొని వచ్చిరి. మీరు దుఃఖపడకండి. నేను మీలోనే ఉన్నాను. చక్కగా చదువుకొని తల్లితండ్రుల సేవ చేయండి అని అనేక నీతులు పిల్లలకు బాబా బోధించిరి. అప్పుడు నేను అక్కడ ఉంటిని. తరువాత భక్తులు ఎవరి ఊరికి వారు వెళ్లిపోయిరి.

బాబా ఒకసారి నాభర్తయగు తమ్మిరాజుగారు చేసిన సాయినాథ శతకమును దిద్దమనిరి. అప్పుడు 'మేష్టారూ! నాకు స్కూలు వేళ అయినది. సాయంకాలము చూస్తాను' అన్నారు. సాయంకాలము బాబాగారు మా యింటికి రాకుండా అన్నగారు, వదినగారు బాబాని సినిమాకి తీసుకొని వెళ్లిరి. అప్పుడు డైనమో పాడైనది. అతని బావమరిది అప్పుడు ఉబ్బసముతో బాధపడెను. రెండవ ఆటకూడా ఆడలేదు. అతనికి యింకనూ ఉబ్బసము ఎక్కువైనది. బావమరిదిని యింటికి తీసుకొని వచ్చిరి. అప్పుడు బాబా నిద్రలోనుండగా లేపి విభూతి యిమ్మని కోరిరి. హస్తచాలనముతో విభాతి తీసి నీళ్లలో వేసి బాధ పడుతున్నతనికి యిచ్చిరి. అతడు ఆ నీళ్లు త్రాగి సుఖముగా నిద్రపోయెను. తెల్లవారిన తరువాత బాబా నాతో యిదంతా చెప్పినారు.

ఒకనాడు సాల్ట్ యిన్స్పెక్టరుగారి యింటిలో భజన చేయుచుండగా, బాబాను ఒక పెద్ద బండపై కూర్చోపెట్టి బాబాకు ఫొటొ తీసుకొనిరి. అప్పుడు ఆ ఫొటొలొ బాబాగారికెదురుగా చిన్న రాయి షిర్డిబాబాగా మారెను. ఆ ఫొటోయొక్క కాపీలు అనేకమంది తీసుకొనిరి. అప్పుడు నేను ఒక ఫొటో అడిగితే లేదనిరి. మరల కొన్నాళ్లకు నేను ఫొటో అడిగినతనే నాకు ఫొటో పంపించినారు. ఆ ఫొటో యిప్పటికీ ఉంది మా యింటిలో.

ఒక గురువారము భజన చేయుచుండగా ఆ హాలులో విమాన శబ్దముతో తూనీగలాగ ఒక కాగితపు మడత

నా కాళ్ల  దగ్గర పడినది. అది కొంతమంది భక్తులు ఆ మడతను విప్పి చూచిరి. ఆ కాగితము షిరిడీ బాబా పటమై యిండెను. ఆ పటము కార్డు సైజులో నున్నది.

మరునాడు నేను స్నానముచేసి బట్ట ఆరవేయిచుంటిని. అప్పుడొక కోతిపిల్ల (రామదూత) చిన్నమూట పట్టుకొని మా యింటి కిటికీలో ఉంచి పోయినది. ఆ మూటను మేము విప్పి చూడగా దానిలో మిఠాయి ప్రసాదము, బాబా వ్రాసిన జాబు ఉండెను. ఆ జాబులో బాబాగారు మీరు నిన్నరాత్రి బాగా భజన చేసిరి. ఈ ప్రసాదము మీరందరూ తీసుకొని ఆనందింపుడు అని వ్రాసియున్నది. అప్పుడు మేమందరము సంతోషముతో ఆ ప్రసాదమును తింటిమి.

మరల కొన్నాళ్లకు హంపి, హోస్పేట, బళ్లారి మొదలగు పట్టణములనుండి భక్తులు సాల్టు యినిస్పెక్టరు బంగళాలో భజన చేయుచెయుచుండగా వచ్చిరి. వారిలో పురుషులు, స్త్రీలు, పిల్లలు ఉండిరి. నేను ఆడవారిని మా యింటికి భోజనమునకు రమ్మని పిలిచితిని. పిల్లలు, ఆడవారు మాయింటికి వచ్చిరి. మగవారికి హెడ్మాష్టరుగారింట్లో భోజనమేర్పాటు చేసిరి. ఆ మేష్టారిగారి భార్య ‘అందరికి మా యింట్లో భోజనమేర్పాటు చేసితిమి కదా, నీవెందుకు శ్రమ పడతావు?’ అని అన్నది. అప్పుడు మరొక భక్తురాలు వాళ్ల యింటికి భోజనమునకు నన్ను పిలచినది. అప్పుడు నేను రాను వీలులేదని చెప్పితిని. ఆ భక్తురాలు తానే మా యింటికి పులిహోర, కజ్జికాయలు మొదలగునవి తెచ్చినది. ఈ పదార్థములన్నియూ వచ్చినవారలకు వడ్డించినాను. ఇవన్నియూ ఎన్నిసార్లు వడ్డించిననూ అక్షయమైపోవుచుండెను.

బాబాగారు కమలాపురము వెళ్లకపూర్వము బాబాను వాళ్లు షిరిడీబాబా పాటలను పాడకూడదనియూ, పటమును పూజింపవలదనియూ బాబాను కట్టుదిట్టముగా నుంచిరి. రెండురోజులు బాబా అట్లే చేసెను. వారి అజ్ఞానమునకు బాబా నవ్వుకొనిరి. అప్పుడు వాళ్లచేతనే బల్ల వేయించి, దానిమీద షిరిడీబాబా పటమునుంచి వారిచేతనే పూజ చేయించిరి. ఇట్లు బాబా, తను పూజ చేయవలదనిన వారిని, తానే వారిచేత పూజచేయించి తన మహిమను చూపించిరి.

బాబాగారు అతీతులై వెళ్లేముందర ఉరవకొండలో వారము రోజులుండిరి. అప్పుడు అందరి యిండ్లలో రోజుకి ఒకరి యింటిలో బాబాగార్కి పాదపూజ చేసిరి. ఆఖరి రోజున  రోజున బాబాగారు వెళ్లిపోతారు, నేను బాబా లేకుండా ఎలా ఉండగలనో అని అనుకొని, బాబాగార్కి ఎవరింటిలో పాదపూజచేయుచున్నారో చూడగా మా వీధిలోని ఒక భక్తుని యింటిలో అని తెలుసుకొని నేను అక్కడకు వెళ్లితిని. బాబాగారు అక్కడ భోజనముచేసి కుర్చీలో కూర్చొని ఒక భక్తురాలు వచ్చును, నాకు వడ్డించిన రీతిగానే పీటవేసి భోజనము వడ్డించమనిరి. వారు అట్లే వడ్డించిరి. ఆ సమయమునకు సరిగా నేను వెళ్లి బాబా పాదములకు నమస్కరించితిని. అప్పుడు బాబాగారు నీవు ఎనిమిది రోజులనుండి భోజనము చేయలేదు. నీకు భోజనము వడ్డించిరి, తినమని చెప్పిరి. అప్పుడు నేను బాబా వాత్సల్యమునకు ఆనందము పట్టలేకపోతిని. పప్పుఅన్నము నెయ్యి వేసుకొని కలిపి ఒక ముద్ద చేతిలో పెట్టుకొని ఆ ముద్ద మింగలేకపోతిని. అప్పుడు భక్తులు నేను భోజనము చేయకమునుపు వారు వడపప్పు ప్రసాదము వేయుట మర్చిపోయిరి. అప్పుడు బాబా వారిచే వడపప్పు వేయించిరి. బాబా వారితో అసలైనది మరచిపోతిరి అనిరి. అప్పుడు భక్తులంతా విస్తరంతా చూచి అన్నీ వేసితిమనిరి. అప్పుడు బాబా ఉప్పు వేయలేదనిరి. అప్పుడు భక్తులు ఉప్పు వేసిరి. భక్తులు బాబాతో ‘ఈమెకు అన్నీ వడ్డించమనిరి కదా, కానీ యీమె ఆనందముతో ఆహారము తినలేకపోవుచున్నది. ఇప్పుడేమి చేయమందురు?’ అని అడిగిరి. అప్పుడు బాబా వారితో ‘ఆమె పిల్లలు యిద్దరు వచ్చెదరు. వారు యీ భోజనము తినెదరు. చేయి కడిగి వేయ’మని చెప్పిరి. వారు అట్లే చేసిరి. నా నోటిలోనున్న ముద్ద దిగుటకు మంచినీరు పట్టించిరి. అప్పుడు నన్ను బాబా దగ్గర  కూర్చుండపెట్టిరి. బాబా నాకు అభయమిచ్చి, ‘అంత ఆవేదము, ఆరాటము పడకు’ అని నాకు బోధించిరి.

తరువాత బాబాగారు పుట్టపర్తి వెళ్లిపోయిరి. కొన్ని రోజులకు నా భర్త తమ్మిరాజుగార్కి ఆసన్నగండమాల అను పెద్దకురుపు పిఱ్ఱలమీద నడుమ దగ్గర వేసినది. ఆయన చాలా బాధపడుచుండిరి. అప్పుడు డాక్టర్లు వచ్చి పరీక్షచేసి

మందు వేసిరి. డాక్టర్లు మాకు చేతకాదు బెంగుళూరో, బళ్లారో తీసుకొని వెళ్లమనిరి. కానీ నేను ఒక్కత్తెను. పిల్లలు చిన్నవారు.అందువలన నేను వెళ్లలేకపోతిని. బాబాను తగ్గించమని ప్రార్థించితిని. ఈయన ఎనిమిది రోజులు బోర్ల పరుండి బాధపడుచుండిరి. ఎనిమిదవ రోజు గురువారము. అప్పుడు నేను బాబా ఫొటోలను శుభ్రపరచి పూజ చేసి, కొబ్బరికాయ కొట్టి, ఆయన బాధను పోగొట్టమని ప్రార్థించితిని. నేను వెన్న, విభూతి కలిపి ఆ కురుపుపై రాసితిని. కొంతసేపటికి నిద్ర పట్టినది. ఆనాడు మధ్యాహ్నము ఒంటిగంటకు లేచి కూర్చొని కాఫీ త్రాగుతామనిరి. అట్లే కాఫీ త్రాగుచుండగా ఆ కురుపు బుడగవలె పేలినది. అప్పుడు నేను పళ్లెము పెట్టగా చీము, రక్తము ఎక్కువగా కారెను. తరువాత కొంతసేపటికి బాధ తగ్గెను. తరువాత సుఖముగా నిద్రపోయిరి. మా పెద్దాబ్బాయి ఐదుగంటలకు అనంతపురమునుండి వచ్చెను. నేను, వాడు ఎప్పుడు లేచెదరో, యేమి అడిగెదరో అని మేము మేలుకొని ఉంటిమి. ఎందువలననగా ఆయనకు ఎనిమిది రోజులనుంచి నిద్రాహారములు లేవు. రాత్రి లేచి నాకు ఏమీ బాధ లేదు, సుఖముగా ఉన్నది అని చెప్పి మమ్ములను పడుకోమనిరి. తరువాత ఉదయము ఆయన లేచి యిడ్లీలు తిని, కాఫీ త్రాగి బడికి నడచి వెళ్లిరి. అంతకురుపు వేసి డాక్టర్లు ఆరునెలలదాకా మానదని చెప్పిన, ఆనాడు ఒకనిముషములో చితుకుట, మరునాడు ఆ కురుపు ఆనవాలు లేకుండా పోవుట వలన, యిదంతా బాబాగారి మహిమని తెలుసుకొని ఆనందముగానుంటిమి. మరునాడు నేను పూజ చేయునప్పుడు 'బాబా మా యింటి డాక్టరువై యీ బాధ పోగొట్టితివి. నీకు ఏమి ఫీజు యివ్వగలము?' అని బాబాకు నమస్కారము చేసితిని. నాడు మొదలుకొని బాబా ఆపద్బాంధవుడు, మా యింటి యిలవేల్పు, మా యింటి డాక్టరు, మా సర్వస్వము బాబాయే అని బాబానే పూజచేయుచుంటిమి. కొంతకాలమునకు బాబా పుట్టపర్తి నుండి అనంతపురము వెడుతూ మా యింటిలో దిగి మమ్మల్నిద్దరిని అనంతపురము ప్లీడరుగారింటికి రమ్మనిరి. అప్పుడు మా పిల్లలందరూ మేమూ వస్తామని పేచీ పెట్టిరి. అప్పుడు బాబా మా అమ్మాయికి ఖాళీ జేబులోనుండి ఒక రూపాయి యిచ్చిరి. అప్పుడు మేమిద్దరము, ఆఖరి పిల్లవాడు బాబాగారితో అనంతపురము ప్లీడరుగారింటికి వెళ్లితిమి. అది యుద్ధసమయము. బయట దీపములు వెలిగించలేదు. బాబాను అనుసరించి లోపలకు వెళ్లితిమి. వాళ్లు అప్పుడు లైట్లు వేసిరి. నేను కరెంటు దీపములు చూచుట అదే ప్రథమము. బాబాగారు భగవంతుడు. అతని వెలుగేయని ఉలిక్కిపడితిని. అది చూచి బబాగారు నన్ను చేయి పట్టుకొని నడిపించుకొని వచ్చిరి. లోపలికి వెళ్లితిమి. అక్కడ పెద్ద పెద్ద ఫొటోలను చుట్టునూ రకరకములైన రంగు విద్యుత్ దీపములను వెలిగించి చాలా బ్రహ్మాండముగా అలంకరించినారు. ఇది చూచి నేను అంతకు పూర్వము కరెంటు దీపములు చూడకపోవుటచే , బాబా వైకుంఠమో, కైలాసమో తీసుకు వెళ్లిరని భావించితిని. అప్పుడు బాబా నా దగ్గరకు వచ్చి మనము ప్లీడరుగారింటికి వచ్చితిమని చెప్పితిరి. అప్పుడు నేను మౌనముగా ఉంటిని. ఆ భ్రాంతి నన్ను వదలలేదు. ఎందువలననగా వారు అంత బాగా అలంకరించిరి. ఆ యింటి ఆడవారు కాఫీ తీసుకువచ్చి నాకిచ్చి దానిని బాబాకిమ్మనిరి. బాబా ఆ కాఫీని అక్కడకు వచ్చిన రోగులకు, కడపునొప్పి మొదలగు బాధలు పడువారికి తీర్థముగా యిచ్చిరి. అప్పుడు భజన చేయుచుండిరి. మా పిల్లవాడు అన్నము తింటానని అన్నాడు. అంతలో ఆ యింటావిడ వచ్చి మీ పిల్లవానికి అన్నము పెట్టెదరా అనిరి. అప్పుడు నేను సరేనంటిని. వారి వంట గదిలోనికి వెళ్లితిని. వారు లైటు వేసిరి. మరల ఆ కాంతిని చూసి ఇది దేవలోకమా అని భ్రమ పడితిని. వారే మావానికి భోజనము పెట్టిరి. తరువాత పది గంటల వరకు భజన చేసిరి. భజన అయిన తరువాత బాబాగారు జబ్బుతో బాధపడుతున్న ముసలి భక్తుని యింటికి వెళ్లిరి. అతనికి హస్తచాలనముతో విభూతిని తీసి యిచ్చిరి. బాబాగారు యింకా రాలేదే, పన్నెండుగంటలకు దీపములు ఆరిపోవునని చింతతో ఉండిరి. అంత బాబాగారు వచ్చిరి. అప్పుడు మేమందరము భోజనము చేసితిమి. తరువాత లైట్లు ఆరిపోయినవి. ఆ రాత్రి యెంతసేపో బాబా లీలము చెప్పుకుంటూ నిద్రపోతిమి. తెల్లవారిన తరువాత స్నానము చేసి కాఫీ త్రాగితిమి. అప్పుడు బాబాగారు పుట్టపర్తి వెళ్లిపోయిరి. తరువాత మేము ఉరవకొండ వెళ్లితిమి. బాబాగారు యింత అమాయకురాలిని

చేరదీసి చూపించిరని, దయామయుని అనుకొనిరి.

మేము ఉరవకొండలో నుండగా బాబా అనంతపురమ మరల వచ్చెదరని తెలిసినది. అప్పుడు రెండుపూటలకు వండి, నేను అనంతపురము ప్లీడరుగారింటికి వెళ్లితిని. ఒక షిరిడీబాబా భక్తుడు మరల షిరిడీబాబా వెలసెనని తెలిసి వారింటికి వచ్చెను. బాబాగారు అంతకుముందే వాళ్ల వదినకు పది రూపాయలిచ్చి నన్ను పుట్టపర్తికి పంపించమని చెప్పినారు. నేను మీ దగ్గరే ఆ డబ్బుఉంచమని చెప్పినాను. నేను అనంతపురము వచ్చుటకు ఆ డబ్బును తీసుకువచ్చితిని. కానీ బాబా నాలుగు రోజులవరకు డి. ఎస్. పి. గారింటికి రాలేదు. మీరిక్కడే ఉండమని డి.ఎస్.పి గారు నాతో అనిరి. వారు ఒకనాడు భజన చేసిరి. ఆ భజనలోకి ఒక దేవీభక్తుడు వచ్చెను. అతడు బాబాగారు యీరోజు రారు, రేపు వచ్చెదరని చెప్పెను. నేను వారింట్లో ఉండమన్నా ఉండకుండా ప్లీడరుగారింటికి వచ్చితిని. మరునాడు శుక్రవారము. ఆనాడు తలంటు పోసుకొని, నేనే వంట చేసుకొని భోజనము చేసితిని. అంతలోనే డి.ఎస్.పి. గారి దగ్గరనుండి ఒక మనిషి వచ్చి బాబాగారు వచ్చారని చెప్పిరి. ఆ మనిషి గుఱ్ఱపుబండి తెచ్చి, దానిలో నేను, మా అబ్బాయి రామారావు ఎక్కి డి.ఎస్.పి. గారింటికి వెళ్లితిమి. బాబాగారు, సుబ్బమ్మగారు ఆరుగంటలకే అక్కడకు వచ్చిరి. నేను వెళ్లినప్పటికి బాబాగారు యోగనిద్రలో నుండిరి. బాబా వచ్చినప్పటినుండి పాఫీ త్రాగలేదట. సుబ్బమ్మగారు  బాబాగారు కాఫీ త్రాగలేదని విచారములోనుండిరి. షిరిడీబాబా భక్తుడు బాబా మేల్కొనుటకు చాలా త్యాగరాజ కృతులను పాడెను. కానీ బాబా లేవలేదు. భక్తులంతా విచారముగా నుండిరి. వారంతా నన్ను పాడమనిరి. అప్పుడు నేను భావముతో కూడిన పాటలు పాడితిని. నేను పాడుతుండగా బాబాగారు కప్పుకున్న శాలువ పైకితీసుకొని గమ్మని లేచిరి. అప్పుడు బాబాగారు నన్ను చూచి 'కామేశ్వరమ్మా! ఎప్పుడు వచ్చితివి?' అని నన్ను మంచముమీద చేయి పట్టుకొని కూర్చుండ పెట్టిరి. మా అబ్బాయి రామారావుకూడా బాబా పక్కన కూర్చొనెను. అప్పుడు నన్ను బాబాగారు,'అమ్మాయీ! నాకేమి తెస్తివి?' అని అడిగిరి. అంతకుపూర్వము సంక్రాంతికి చేసిన రెండు మిఠాయిలు తెచ్చితిని. కానీ ఒక మిఠాయి కుక్క తినేసింది. ఇంకొక మిఠాయిలోని సగము అక్కడున్న పిల్లలు తినిరి. మిగిలిన సగము నాచీరకొంగున కట్టితిని. ఏమిరా అబ్బాయిని చూస్తూ ఉండమన్నానుగా అని మా అబ్బాయిని అడుగుతే వాళ్లు వచ్చి తినేశారు నేనేమి చేయను అని మా అబ్బాయి అన్నాడు. అప్పుడు బాబా నన్ను అడిగినప్పుడు నేను యీ సగము ఉండ యెలా యివ్వగలను? చాలామంది పెద్దపెద్దవాళ్లు యేమేమో పిండివంటలు పెట్టుకొని బాబా ఎప్పుడు లేచునా, ఎప్పుడు తినెదరా అనిఉండిరి. అందువలన నేను యివ్వలేకపోతిని. అప్పుడు బాబా శ్రీకృష్ణుడు కుచేలుని కొంగునున్న అటుకులు తీసుకొని తినెనో అట్లే బాబా నా కొంగునున్న సగము మిఠాయి ఉండను, కొంగు విప్పి తీసుకొనిరి. బాబా దానిలో రెండు పూసలు తినిరి. అంతలో ఒక భక్తుడు మాకు కూడా ప్రసాదము పెట్టమని అడిగెను. అప్పుడు బాబా తానే ఆ మిఠాయి ఉండను అదరి భక్తులకి ప్రసాదముగా యిచ్చెను. ఆ సగము మిఠాయి అందరకూ సరిపోయినది.

మధ్యహ్నాము  భోజనము పెట్టిరి. అప్పుడు నేను వడ్డించితిని. బాబా ఐదు విస్తరాకులు వేయించుకొని చాలా ఎక్కువ అన్నము వడ్డించమనిరి. ఆ అన్నమంతయూ మిగిలిన పదార్ధములతో కలిపి పెద్దపెద్ద ముద్దలుగా చేసిరి. మదువందలమంది భక్తులు వచ్చిరి. వారిలో, ఆంతరంగిక భక్తులు అనగా మిక్కిలి భక్తి మనస్సున కలవారిని బాబా పేరుపేరునా పిల్చుచూ ఒక్కొక్క భక్తునకు ఒక్కొక్క ముద్ద చొప్పున ప్రసాదముగా యిచ్చిరి. అప్పుడు నాకుకూడా యిచ్చిరి. కానీ నేను తినుటకు సందేహించితిని. ఎందువలననగా ఆరోజు శుక్రవారము. నేను శక్రవారము ఒక పూట భోజనముచేయు వ్రతము పట్టితిని. కానీ బాబా యిచ్చిన ప్రసాదము జన్మరాహిత్యము కల్గునని, శుక్రవారము పూజ మరల జన్మకు లక్ష్మీకటాక్షము కల్గునని, ఏది గొప్పదని ఆలోచించి నేను ఆ ప్రసాదమును తీసుకుంటిని. ఎందువలననగా ఆ ప్రసాదము తినుటవలన జన్మరాహిత్యము కల్గును.

సాయంకాలము నల్గురు పక్షవాతముతో బాధపడుచున్న ఇనిస్పెక్టర్లు బాబాగారి దగ్గరకు వచ్చిరి. బండిలోనుండి

దింపి కుర్చీలలో కూర్చుండపెట్టిరి. బాబా వారి దగ్గరకు వచ్చి వారిని నిలబడమని చెప్పిరి. కానీ వారు నుంచోలేమని చెప్పిరి. అప్పుడు బాబా వారిని కసిరిరి. వారు నుంచొనిరి. బాబా వారిని ఒకరిచేయి ఒకరు పట్టుకొని బంగ్లా చుట్టూ తిరగమనిరి. వారు అట్లే చేసిరి. వారు సులభంగా బండి ఎక్కి వెళ్లిపోయిరి. బాబా వాళ్లను కసరుట వలన వారిలోని పక్షవాతము మాయమైనది. అప్పుడు వారి వెనుక బాబా, నేను, అందరు భక్తులు బంగ్లా చుట్టూ తిరిగిరి. బాబా వారితో పుట్టపర్తి రమ్మని చెప్పిరి.

మరునాడుదయము మేమందరము డి.ఎస్.పి. గారింట్లో కాఫీ, టిఫిన్లు తీసుకొంటిమి. అప్పుడు బాబాగారు బస్సుని, మా అబ్బాయితో భూతం వస్తున్నాది, అది మనదే అని అన్నారు. మా అబ్బాయి వచ్చి'బస్సుని బాబా భూతమని అంటున్నారు, మనదే అంటున్నారు మనకు టిక్కట్టు డబ్బు తీసుకోరేమో' అని అన్నాడు. మా వాడు చెప్పినట్లుగానే మాదగ్గర టిక్కట్టు డబ్బు తీసుకోలేదు. మేము బస్సులో ప్రయాణము చేయుచుండగా ఒకామెకు దయ్యము పట్టినది. ఆమె భర్త విచారముగా నుండెను. ఆమె మా బస్సు వెనుకగా పరుగెత్తుకొని వచ్చి బాబా దగ్గరకు వచ్చినది. అప్పుడు బాబా తన తలలోని ఒక వెంట్రుక తీసివేసిరి. ఆవిడ వెడతాను బాబా అంటూ ఆవిడకు పట్టిన దయ్యము వదలిపోయినది. అంతలో ఆవిడ భర్త సంతోషముగా వచ్చి భర్యతో వారి ఊరికి వెళ్లిరి. ఈ బస్సు కొత్తచెరువు అనే ఊరు దగ్గర ఆగినది. అప్పుడు బాబా మాతో '12గంటలైనది. కాఫీ, టిఫెన్లు తోసుకోండి' అన్నారు. అందరమూ దిగి హోటలుకు వెళ్లితిమి. ఆరోజు శనివారమని నేను తీసుకోలేదు. మా అబ్బాయికూడా వద్దన్నాడు. బాబా రెండు పూరీలు, ఉల్లిపాయకూర తెచ్చి నా చేతికిచ్చి తినమనిరి. శనివారమని ఆకుకూర వేసిన పూరీ మా అబ్బాయికిచ్చి రెండవ పూరీ నేను తింటిని. మరల ఉల్లిపాయకూరతో రెండు పూరీలను యిచ్చిరి. అబ్బాయిని తినమంటే వద్దన్నాడు. అప్పుడు నేనే ఆ కూరతో రెండు పూరీలు తింటిని. బాబా యిచ్చెను కనుక ఉల్లిపాయ తిన్నా దోషములేదని అనుకొంటిని. తరువాత మేము బస్సు యెక్కి బుక్కపట్టణము వెళ్లితిమి. అక్కడ భక్తుల యింటికి వెళ్లితిమి. అప్పుడు రెండు గంటలైనది.

బాబాగారికి తలంటి నీళ్లు పోసిరి. అప్పుడు నేను వీపు రుద్దినాను. మిగిలిన భక్తులు కాళ్లు, చేతులు రుద్దిరి. బాబాకి చాలా ఎక్కువ నీళ్లు పోసిరి. ఆయన స్నానము చేసిన నీరు అందరూ తీర్థముగా తీసుకొనిరి. తరువాత మేమందరము భోజనము చేసితిమి. తరువాత కొంచెము సేపు విశ్రాంతి తీసుకొని భజన చేసితిమి. అక్కడికి మైసూరు, బెంగుళూరు మొలగు పట్టణములనుండి 25మంది దయ్యము పట్టినవాళ్లు వచ్చిరి. వాళ్లను వరుసగా కూర్చుండబెట్టి, బాబా వారిచే భజన చేయించిరి. బాబాగారు కఱ్ఱ పట్టుకొని సాయిహరే సత్యసాయిహరే అని ఆ దయ్యములచే భజన చేయించి వారి మధ్య తిరుగుచుండెను. ఆ దయ్యములు కొంచెముసేపు భజన చేయుచు, బాబా, బాబా అని వెక్కిరిస్తూ, వెఱ్ఱిచూపులు చూస్తూ భజన చేసేవి. అప్పుడు బాబా కఱ్ఱ చూపెట్టగా మామూలుగా ఊరుకొన్నాయి. ఇట్లు మూడుసార్లు జరిగినది. ఒక దయ్యము బాబాతో నా కర్మ నాకిచ్చెయ్, లేకపోతే నీ పాదములియ్యి. బాబా పాదములు పట్టుకొనకుండా బాబా మేడ ఎక్కబోయిరి. బాబా యివ్వకపోతే ప్రశాంతినిలయమును యేమిచేస్తానో చూడు అని ఆ దయ్యము బాబాతో అన్నది. అప్పుడు బాబా దయ్యము వైపు గంభీరముగా చూడగా అది బాబా గౌను పట్టుకొని చింపివేసినది. ఇది ప్రశాంతినిలయములో జరిగినది. భక్తుని యింటిలో 25 మంది దయ్యములు పట్టినవారి తలలలో నుండి ఒక్కొక్క వెంట్రుక తీసివేయగా పోతాంబాబా, పోతాం బాబా అనుచూ నమస్కరించి దయ్యములు వెడలిపోయినవి. మేమందరము ఆనందముగా భజన చేసితిమి. మరునాడు మేము పుట్టపర్తికి వెళ్లితిమి. అక్కడ నేను ఎనిమిది రోజులున్నాను. ఒకనాడు బాబాగారు ఎనిమిది గంటలదాకా లేవలేదు. యోగనిద్రలోనుండిరి. భక్తులందరూ ఎన్నియో మేలుకొలుపు పాటలు పాడిరి. సుబ్బమ్మగారు బాబా యింకా లేవలేదే, కాఫీఫలహారములు చల్లారిపోతున్నవి అని విచారించుచుండిరి. అప్పుడు నేను మందిరమునకు వెళ్లితిని. నేను బాబా మీద మేలుకొలుపు పాటలు పాడుచుండగా బాబా లేచిరి. కాఫీఫలహారములు తీసుకొంటిమి. తరువాత బాబాగారు మమ్ములను కొందరి భక్తుల యిండ్లకు

తీసుకొని వెళ్లిరి. ఒక భక్తురాలు ఐదు విషము కలిపిన గారెలు వండినది. ఆ భక్తురాలు భక్తితో ఆ విషపు గారెలు బాబాకు ఫలహారముగా పెట్టినది. అప్పుడు బాబా అందరితో ఈ గారెలు ఐదు విషముతో కూడి ఉన్నవి అనిరి. అప్పుడు అందరూ ఆ గారెను మాకియ్యి బాబా, మాకియ్యి బాబా అనిరి. కానీ బాబా ఆ గారెలను తినివేసిరి. విషము బాబాను యేమియూ చేయలేదు. ఈ విషయము బాబా మాతో చెప్పిరి. కానీ యిప్పుడామె మహా భక్తురాలై ఉన్నది.

బాబాగారు తాను చేసిన మహిమ మాతో చెప్పిరి. చలికాలములో ఒక ఊరిలో ఒక అమ్మాయి వాళ్ల యింటిలో బల్లచెక్కపైనున్న వస్తువులను తీసుకొనుటకు చేయి పైకి పెట్టినది. కానీ చెయ్యి అలా ఉండిపోయినది. ఎడమ చేయి కూడా అట్లానే ఉన్నది. ఎందువలననగా చలికాలములో నీరసము వలన చేతులు అట్లు ఉండిపోయినవి. ఎన్నియో ఆసుపత్రులలో చూపించిరి. కానీ లాభము లేకపోయినది. ఆఖరికి బాబా భగవంతుడని తెలిసి, బాబా దగ్గరకు పుట్టపర్తికి అమ్మాయిని తీసుకువచ్చిరి. బాబా వారితో నాలుగు వీధుల మధ్య పందిరి వేయించిరి. వాటి మధ్య ఒక స్టూలు వేసి దనిమీద ఆ అమ్మాయిని నిలబెట్టమనిరి. వాళ్లు అట్లు చేసిరి. భక్తులందరూ భజన చేయుచుండిరి. అంతలో బాబా ఆ అమ్మాయి దగ్గరకొచ్చి చీరకుచ్చెళ్లు పట్టుకొనిరి. అప్పుడు ఆ అమ్మాయి భయముతో రెండు చేతులు గభాలున క్రిందకు దింపి బాబా చేయినుండి విడిపించుకొన్నది. ఆ అమ్మాయి తల్లిదండ్రులు, అత్తమామలు, ఆ అమ్మాయి బాబాకు సాష్టాంగనమస్కారము చేసిరి.

మరల కొన్నాళ్లకు ఒక అమ్మాయికి టైఫాయిడ్ జ్వరము వచ్చి మాట పడిపోయినది. వారుకూడా కొన్ని ఆసుపత్రులలో చూపించిరి. బాబా దేవుడని తెలుసుకొని బాబా దగ్గరకు తీసుకొని వచ్చిరి. అప్పుడు బాబా ఆ అమ్మాయిని ఒక గదిలో ఉంచి, ఆ గదిలోని కిటికీకెదురుగానున్న గదిలో ఆమె భర్తను, తల్లిదండ్రులను, అత్తమామలను కూర్చోమనిరి. ఆ కిటికీ తెరచి ఉంచిరి. బాబా ఆ అమ్మాయి గదిలోనికి వచ్చి ' నీవు హిందూధర్మాచారమునకు విరుద్ధముగా ప్రవర్తించుచుంటివి. నీకు భర్త ఉండగా మరల పెండ్లి చేసుకొందువా? నీ భర్త చాలా బాధపడుతున్నాడు' అని అనగా ఆ అమ్మాయి' నాకు నా భర్తకు యేమీ లేదు. బాబా నీవు మా యిద్దరిని విడదీయకుము' అని పల్కి బాబా పాదములపై పడెను. ఇదంతయూ చూచుచున్న ఆ అమ్మాయి భర్త, తల్లిదండ్రులు, అత్తమామలు బాబా దగ్గరకు వచ్చి పాదములకు నమస్కరించిరి. ఇట్లు బాబా ఆ అమ్మాయికి మాట యిచ్చెను. ఈ లీల బాబా మాతో చెప్పిరి.

ఇంకొక లీల కూడా బాబా మాతో చెప్పిరి. భక్తులతో బాబా బండ్లలో ప్రయాణము చేయుచుండిరి. సగము దూరము ప్రయాణము చేసిన తరువాత బాబా బండి దిగిరి. అంతలో ఒక అమ్మాయి ఆభరణములు ఎక్కువగా ధరించి ఆడవారున్న బండి దగ్గరకు వచ్చి, 'నా భర్త అనంతపురము ఆసుపత్రిలో ఉన్నాడు. నేను నడవలేకపోతున్నాను' అని ఆ అమ్మాయి అన్నది. వాళ్లు బండిలోనికి ఎక్కించుకొనిరి. వెనుక బండిలో బాబా ఉన్నాడని తలంచి ప్రయాణము చేసిరి. కొంతసేపటికి ఆ అమ్మాయి దిగి ఎక్కడికో వెళ్లినది. మొదటి బండిలో బాబా ఉండిరి. వారంరూ ఆ అమ్మాయి కోసం వెతుకగా ఎక్కడా కనిపించలేదు. అప్పుడు బాబాగారు పకపక నవ్విరి. నేనే ఆ అమ్మాయిని అని పల్కిరి. అప్పుడు అందరూ ఆనందముగా ప్రయాణము చేసిరి.

కొన్ని దినములైన తరువాత ఉరవకొండ వదలి మేము తూర్పుగోదావరి జిల్లాలోని తునిలో ఉంటిమి. మా పిల్లలందరు తునిలో చదువుచుండిగి. బాబాను వదలి దూరముగా వచ్చేశాను అని నేను రోజూ నిద్రాహారములు లేక తపించిపోతిని. కొంతకాలమైన తరువాత మహోదయము వచ్చినది. ఆ ఊరిలోని కొందరు ఆడవారితో నేను భజన చేయుచు నడిచి సముద్రస్నానమునకు వెళ్లితిని. రెండురోజులు చతుర్ధశి, అమావాస్య స్నానము చేసితిని. బాబా నీవులేకుండా నేను ఉండలేను అని ఆవేదన పడితిని. ఇంటి దగ్గర పిల్లలుండిరి. మరల నేను సముద్రమునుండి నడచి వచ్చితిని. ఏది విన్నా, ఏది చూచినా బాబా ఉన్నట్లుగానే అని నా మనస్సులో ఉండేది. నేను ఇంటికి వెడుతుండగా దారిలో కనబడిన భక్తులు నాతో 'మీకు బాబా ఉత్తరము వ్రాసారు' అనిరి. అప్పుడు నేను వాళ్లతో 'నాతో మీరు

హాస్యములాడకండమ్మా, నాకు బాబాకు దోముకు ఏనుగుకు గల తేడా ఉన్నది. నేను ఆవేదనలో ఉన్నాను' అని అంటిని.'మేము ఎప్పుడైనా హాస్యమాడామా? నిజముగానే ఉత్తరము వచ్చినది' అని వారు చెప్పిరి. అప్పుడు నేను వారితో ఏమి వ్రాశారని అడిగితిని. వాళ్లు' మిమ్మల్ని శివరాత్రికి పుట్టపర్తి రమ్మని వ్రాసిరి' అని చెప్పిరి. నేను యింటికి రాగానే మా కిల్లలు నాకు ఉత్తరమును యిచ్చిరి. ఆ ఉత్తరము చదువుటకు మూడు గంటలు పట్టినది. చదువుతున్నప్పుడు ఆనందము పట్టలేకపోతిని. అప్పటకి నేను బాబాను చూసి ఆరు సంవత్సరములైనది. బాబా కనబడునని ఎన్నో ఏకాహములు, భజనలు చేసితిని, ఆఖరుకి నాకు జబ్బు చేసినది. ఏ డాక్టరుకీ చూపించలేదు. బాబా నామము స్మరణ చేసుకుంటూ ఉండగా ఆ జబ్బు తగ్గిపోయినది. శివరాత్రికి నేను ఒక్కదానినే ఉరవకొండ వెళ్లితిని. శివరాత్రికి నాలుగు రోజులు ముందుగా వెళ్లితిని. ఉరవకొండలో స్నానము చేసి నేను నా భర్త తమ్మిరాజుగారు పుట్టపర్తి వెళ్లితిమి. అక్కడ బాబా ఉండిరి. అప్పుడు నేను మరువం, దవనం బాబాచేతిలో పెట్టితిని. అప్పుడు బాబా' యిద్దరూ వచ్చినారా! సంతోషము' అన్నారు. బ్రహ్మాండముగా భజన జరిగినది. ఈ రాత్రి మీరిక్కడే ఉండి తెల్లవారిన తరువాత ప్రశాతినిలయమునకు రమ్మని చెప్పిరి. తెల్లవారి లేచిన తరువాత చిత్రావతి నదిలో స్నానము చేసి బాబా దగ్గరకు వెళ్లితిమి. మేడమెట్లకెదురుగానున్న గదిలో కూర్చోమనిరి. కొంచెము సేపైన తరువాత కొందరు భక్తులను పంపించి మాకు కాఫీ, టిఫిన్లు పంపించిరి. కొంతసేపటికి మమ్మల్ని బాబాగారు మేడమీదకి రమ్మనిరి. మేము మేడమీదకి వెళ్లిన తరువాత మాతో వెంకటగిరి మహారాజా, వారి కుమారులను, ఉద్యోగస్తులను పరిచయము చేసిరి. బాబాగారు పన్నెండు గంటలకు వెండి షిర్డీబాబాకు విభూతి, పంచామృతములతో స్వయముగా అభిషేకము చేసిరి. అక్కడున్న భక్తులమీద, బాబా ఖాళీ బిందెనుండి తీసిన విభూతి గాలి వలన విభూతి వారిపై కొద్దిగా పడినది. అందరూ చాలా ఆనందపడినారు. ఆ రాత్రి భక్తులందరూ ఓంనమశ్శివాయ అనుచు భజన చేయుచుండగా, బాబా పెద్ద లోటాచెంబుతో నీళ్లు కొద్దికొద్దిగా త్రాగిరి. బాబా పెద్దగా గొంతు సవరించుకొనిరి. అప్పుడు బాబా దగ్గర పళ్ళెము పట్టుకొనగా బాబా నోటిలో నుండి హేమలింగము, స్పటికలింగము తీసిరి. అందరు భక్తులు శివనామస్మరణముతో జాగరణము చేసిరి. మరునాడు నా భర్త తమ్మిరాజుగారు' నాకు సెలవు అయిపోయినది. వెళ్లి డ్యూటీలో చేరమంటావా, లేక రాజీనామా యివ్వమంటావా' అని అడిగిరి. బాబా ఆయనతో' నీవు రాజీనామా యివ్వవద్దు. డ్యూటీలో చేరు' అని చెప్పిరి. బాబాగారు నన్ను అమ్మాయి అని పిలిచెడివారు. తమ్మిరాజుగారు దావులూరి సుబ్బారావుగారికి ఆరు రూపాయలిచ్చి రెండురోజుల తరువాత బస్సు ఎక్కించమనిరి. బాబాగారితోకూడా నన్ను రెండరోజులుంచుకొని పంపించమన్నారు. నాకు కావలసిన ఆహారసదుపాయములన్నింటిని దావులూరి సుబ్బారావుగారు అమర్చుచుండెడివారు. బాబాగారు అనేక లీలలు, మహిమలు అతివైభవముగా చూపించిరి. అప్పుడు బాబాగారు కళ్ళు లేనివారికి కళ్లు యిచ్చి, క్షయరోగముచేత బాధపడువారికి క్షయ పోగొట్టిరి. ఇట్టి మహిమలు చూచుచూ ఆనందముగా నేను 20 రోజులు గడిపితిని.

అనంతపురములో దాసిగా పనిచేయుచున్న ఒకామెకు వీపుపైన రాచపుండు వేయుట వలన ఆమె తీవ్రమైన బాధతో కూడిన జ్వరముతో బాధపడుచుండెను. ఆమెకు బాబా కలలో కనబడి ప్రశాంతినిలయమునకు రమ్మనిరి. ఆమె తినుటకు కావలసిన పదార్థములు, వీపుమీద ఒక గోనె కప్పుకొని పుట్టపర్తి వచ్చినది. అజ్ఞానులు బాబా ధనవంతులను, ఉద్యోగస్తులను పిలుస్తుంటారని అనుకొందురు. బాబా భగవంతుడు కనుక ఆయనకు అందరూ సమానమే. పేదగొప్ప బేధము లేదు. నిదర్శనముగా దాసీని యిక్కడకు రమ్మని బాధ తగ్గించిరి. మరునాడు ఆమె ప్రశాంతినిలయము తుడుచుచున్నది. అందరూ ఆశ్చర్యచకితులైరి. బాబా ఆ పుండు మీద విభూతి వేయగా క్షణములో బాధ తగ్గి మామామూలుగా నుండెను. సాధారణముగా రాచపుండు తగ్గుటకు నెలలు పట్టును. కానీ బాబా తలచుటచే క్షణములో మాయమయ్యెను. బాబా ఎంత దీనదయాళుడో చూచితిరి కదా! ఆయన యిటువంటివి కొన్ని కోట్ల

మహిమలు చేసిరి.

ఒక ఊరినుండి కొందరు కమ్మవారు పుట్టపర్తికి వచ్చిరి. వారిలో కొందరు ఆడవారు యింటర్వ్యూ యిచ్చెదరేమోనని కూర్చుండిరి. వారిలో ఒకావిడ ఛార్జీలకని ఐదువందల రూపాయలు కొంగున కట్టుకొన్నది. ఇంకొకావిడ ఆ ఐదువందలను కొంగువిప్పి తీసుకొన్నది. పోగొట్టుకొన్నావిడ, దొంగిలించినావిడ యిద్దరూ ధనవంతులే. కానీ డబ్బును చూచుసరికి అందరికీ ఆశ పుట్టును. ఇది బాబాగారికి తెలిసినది. ఆయనకు తెలియనిది లేదు. బాబా సంర్వాంత్ర్యామి. ఆ ఊరివారందరిని ఒకేసారి లోపలికి రమ్మనిరి. అందరూ వెళ్ళిరి. బాబా అప్పుడు దొంగిలించినావిడతో ' ఆమె డబ్బు పోగొట్టుకొని ఏడ్చుచున్నది. నీవు ఆ డబ్బు దాచుకొనలేక ఏడుచచుంటివి. ఆ డబ్బు ఆమెకు యియ్యి' అని తీర్పు చెప్పిరి. ఆమె తన తప్పు క్షమించమని, ఆమెకు ఆ డబ్బు యిచ్చివేసినది. ఇట్లు ఎన్నో సార్లు ఎవరినీ ఏమీ అనకుండా న్యాయమూర్తిలాగ తీర్పునిచ్చి ఎంతోమందిని రక్షించిరి. అట్లే మనలను రక్షింతురు. కానీ అటువంటి తప్పు మనము చేయకూడదు.

అక్కడకు వచ్చిన భక్తులందరూ బాబాకు పాదపూజ చేసిరి. అందులో దావులూరి సుబ్బారావుగారు కూడా పాదపూజ చేసిరి. అంతలో నన్ను పంపించమని రెండుమూడు ఉత్తరములు వ్రాసిరి. బాబా నన్ను పంపించలేదు. మా ఊరు నేను వెళ్లుటకు ముందు నేను బాబాతో పాదపూజ చేసుకుంటాననగా బాబా సరే అనిరి. బాబా నాతో భజన అయ్యాక మేడమీద పాదపూజ చేసుకోమనిరి. ఈ విషయము నేను దావులూరి సుబ్బారావుగారితో చెప్పగా, ఆయన పాదపూజకవసరమైన అన్ని సామానులు సమకూర్చి నాకు యిచ్చిరి. అవన్నీ సంచిలో పెట్టుకొని మేడమీద కూర్చొంటిని. నేను కూర్చున్నప్పుడు నా తొడమీద రెండు కుక్కపిల్లలు కూర్చున్నవి. అంతలో బాబావారు వచ్చిరి. వెంటనే బాబా నాతో 'ముందర కుక్కపిల్లలకు అన్నము పెట్టాక నీవు పాదపూజ చేయుదువుగాని' అనిరి. బాబాకు జంతువులన్న ఎంత దయయో చూడుడు. ఆయన వాటికి అన్నము పెట్టు సమయమున నేను ఆ గదిలో స్టూలుమీదనున్న బాబా పటములను చూచుచుంటిని. అందులో ఒక ఫొటో నాకు నచ్చినది. దానిని కొందామని భక్తులతోనంటిని. వారు ఆ పటము చాలా ఖరీదని నాతో చెప్పిరి. నేను అంత ఖరీదు పెట్టి ఆ ఫొటోను కొనలేను. మనసులో తలచుకొన్న చాలుననుకొని ఆ ఫొటోపై ఆశ వదలుకొంటిని. బాబా నన్ను ఇంటర్వ్యూ గది దగ్గరకు రమ్మనిరి. ముగింపు లేదు.